నిధులున్నా.. నిర్లక్ష్యమే!

- వైద్యానికి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాలి
- ప్రమాదం జరిగినా పట్టింపులేదు
- అలసత్వం వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


రాజాపూర్ ప్రభుత్వాస్పత్రి పక్కన పైపులు తొలగించడంతో ప్రమాదకరంగా ఉన్న మురుగుకాల్వ

రాజాపూర్: అధికారుల అలసత్వమో, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమో.. రాజాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి పక్కన మురుగు కాల్వ ఓ చిన్నారిని బలితీసుకుంది. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మరో ప్రమాదం జరిగితే తప్పా స్పందించేలా కనిపించడం లేదు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పక్కన ఉన్న అండర్‌డ్రైయినేజీ మురుగు కాల్వ జామ్ కావడంతో పైప్‌లైన్‌లను తొలగించి రోడ్డు పక్కన పడవేశారు. నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఆస్పత్రికి వచ్చే రోగులు సైతం ముక్కు మూసుకుని వైద్యంకోసం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మురుగు రోడ్డుపైకి రాకుండా తీసిన మురుగు కాల్వలో ఐదారు నెలల క్రితం అభం, శుభం తెలియని యశ్వంత్ అనే బాలుడు ఆడుకుంటూ వెళ్లి అందులో పడి మృతి చెందాడు. అప్పట్లో మురుగు కాల్వను నిర్మించి ఉంటే ఆ ప్రమాదం సంభవించేది కాదు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆస్పత్రికి రావాలంటే ముక్కు మూసుకోవాల్సిందే..



రోగం వచ్చి మాలాంటి వారు ప్రభుత్వ దవఖానాకు పోతుంటే ముందుగానే మురుగువాసన భరించలేక ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. కాల్వలో పడి పసిబాలుడు చనిపోయినా సారోళ్లు పట్టించుకోకపోవడం విడ్డూరం. వెంటనే మురుగుకాల్వ పనులు పూర్తి చేయాలి.

– రమేష్‌నాయక్, వాచ్యాతండా

పైసలుంటే పనులెందుకు చేయడంలేదు?



ప్రమాదం జరిగి బాలుడు చనిపోయినప్పుడు అధికారులు హడావుడి చేశారు. రెండున్నర లక్షల నిధులు ఉన్నప్పుడు పనులు ఎందుకు చేయడంలేదు. మరో ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి మురుగుకాల్వ పనులు పూర్తి చేయాలి.

– వెంకట్‌రాజు, మల్లేపల్లి

రూ.రెండున్నర లక్షల నిధులున్నాయి..

మురుగుకాల్వ పనుల నిర్మాణం కోసం రెండున్నర లక్షల నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు చేయించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. త్వరలోనే ఎవరికైనా పనులు అప్పగించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– మశ్చందర్, ఎంపీడీఓ, రాజాపూర్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో శివమాలధారికి గాయాలు

మిడ్జిల్: మండల కేంద్రానికి చెందిన సోట చరణ్ శివదీక్ష చేపట్టారు. శుక్రవారం తోటి మాలధారులతో కలిసి శివాలయం దగ్గర ఇరుముడి కార్యక్రమానికి ఇంటి నుంచి వెళ్తుండగా ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై కారు ఢీకొట్టింది. దీంతో చరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

నవాబుపేట: మండలంలోని అమ్మాపూర్ గేట్ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. శుక్రవారం ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి అక్రమంగా ఇసుకను తీసుకొని కొల్లూర్ గ్రామం వైపు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ పరారు కాగా, టిప్పర్ నంబర్ ద్వారా యజమాని జడ్చర్ల మండలం అంబటిపూర్ గ్రామానికి చెందిన రాజుగా గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మసీద్ స్థల దాతకు సన్మానం



మిడ్జిల్: మండల కేంద్రంలో మసీద్ నిర్మాణం కోసం రూ.30 లక్షల వ్యయంతో 400 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి విరాళంగా ఇచ్చిన దాత బోయిన్‌పల్లికి చెందిన జహంగీర్‌ను శుక్రవారం మండల కేంద్రంలో ముస్లింలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షులు జహంగీర్, పెద్దలు హకీం, మహబూబ్, గౌస్, సద్దాం, నభి, జహీర్, మాజార్‌పాషా, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

మహమ్మదాబాద్: మేతకోసం వెళ్లిన పాడిగేదె విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని గాధిర్యాల్ గ్రామానికి చెందిన ఎర్ర అంజిలమ్మ, రాములు పాడిగేదెలను పోషిస్తూ పాలతో జీవనం గడుపుతున్నారు. గురువారం తమ పొలంలో సాయంత్రం గేదెలు కట్టేసి ఇంటికి వెళ్లారు. రాత్రివేళలో తాడుతెంపుకుని గేదె పక్కపొలంలో మేతకోసం వెళ్లింది. ఈ క్రమంలో బోరు స్టాటర్ విద్యుత్ తీగలు గేదెకు తగలడంతో షాక్‌తో అక్కడికక్కడే మృత్యువాత పడింది. సుమారు రూ.80వేల విలువ చేసే పాడిగేదె చనిపోవడంతో అంజిలమ్మ బోరున విలపించారు.


డ్రెయినేజీపై స్లాబ్ నిర్మాణ పనులు ప్రారంభం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో మురికి కాల్వపై స్లాబ్ నిర్మాణ పనులను చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో స్లాబ్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ పాలాది సారిక, వార్డు కౌన్సిలర్ సతీష్ పాల్గొన్నారు.

నేడు టీయూసీసీ రాష్ట్ర మహాసభ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని హోటల్‌లో ట్రేడ్ యూనియన్ కో ఆర్డినేట్ కమిటీ (టీయూసీసీ) రాష్ట్ర మహాసభ శనివారం నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకులు చాంద్ ఖాన్ తెలిపారు. మహాసభకు యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఈఎస్ఐ ఆస్పత్రుల స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌పీ తివారి, రాష్ట్ర అధ్యక్షుడు కన్నయ్య, ప్రధాన కార్యదర్శి డా.గణేష్‌రావులు హాజరవుతారని తెలిపారు. మహాసభ సాయంత్రం వరకు కొనసాగుతుందని, తెలంగాణ నలుమూలల నుంచి 140 మంది ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

నేటి నుంచి వార్షికోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం న్యూమోతీనగర్‌లోని శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వనాథేశ్వరస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం, శ్రీకాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం, ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ధర్మకర్త, చైర్మన్ ఎన్.ప్రభాకర్ మాట్లాడుతూ దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హోమం కోసం యాగశాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములుయాదవ్, యాదగిరి, రవికుమార్, అనురాధ, రాణి, తులసీ, జ్యోతి, పుష్పలత, ఆండాలు, లక్ష్మి, జానకి, విజయలక్ష్మి, మహేశ్వరి, శోభ పాల్గొన్నారు.

ఘనంగా శివమాలధారుల ఇరుముడి


మిడ్జిల్‌లో పూజ నిర్వహిస్తున్న మాలధారులు

మిడ్జిల్: మండల కేంద్రంలో 41 రోజుల పాటు శివదీక్ష చేపట్టిన మాలధారులు శుక్రవారం శివాలయం దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడి కట్టుకొని శ్రీశైలానికి 42 మంది బయలుదేరారు. మరో 50 మంది సివిల్ దుస్తుల్లో వారికి తోడుగా పాదయాత్రగా వెళ్లారు. అనంతరం దాత మామిడిమాడ భాస్కర్ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుదర్శన్, మాజీ ఎంపీటీసీ గౌస్, పెద్దలు పర్వతాలు, శంకర్, రాంగౌడ్, గోపాల్ మల్లయ్య, నరేష్, హరిగౌడ్, రమేష్, నాగయ్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


కొత్త మొల్గరలో శివమాలధారులకు వాటర్‌బాటిళ్లు అందజేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

శివమాలధారులు వాటర్ బాటిళ్ల వితరణ

భూత్పూర్: మండంలోని కొత్తమొల్గర వద్ద శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివ మాలధారులకు కప్పెట గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ కప్పెట గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి వాటర్ బాటిళ్లు అందజేశారు.

వాసవీమాతకు ఘనంగా పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం ప్రత్యేక అలంకారంలో పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. సాయంత్రం దేవాలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించి లలితా పారాయణం చేశారు. అనంతరం వాసవీమాతకు పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు.

మాతృభాషపై అవగాహన



రాజాపూర్: మాతృభాష దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని మల్లేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నర్సోజి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాతృభాష ప్రాధాన్యత బోధనోపకరణాలతో క్షేత్రస్థాయిలో వివిధ యాక్టివిటీలపై వివరించారు. భాషల ద్వారా ఒక జాతియొక్క ఉనికి, సంస్కృతి కాపాడబడతాయన్నారు. ప్రధానోపాధ్యాయులు రవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కమిషనర్‌పై సీడీఎంఏ డైరెక్టర్‌కు ఫిర్యాదు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మున్సిపాలిటీ కమిషనర్ లక్ష్మారెడ్డిపై సీడీఎంఏ డైరెక్టర్‌కు శుక్రవారం లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు 26వ వార్డు కౌన్సిలర్ ఆలూరి శశికిరణ్ విలేకరులకు తెలిపారు. మున్సిపాలిటీలో ఇళ్ల పేర్ల మార్పిడికి నోచుకోవటం లేదని, ట్రేడ్ లైసెన్స్‌లకు దరఖాస్తు చేసుకున్న వారికి అప్రూవ్ చేయకుండా ఉన్నారని పేర్కొన్నారు. ఇళ్ల అనుమతి లేకుండా నిర్మిస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవటం లేదని, పాలకవర్గానికి తెలియకుండా స్క్రాప్ వేలం వేశారనే పలు ఆరోపణలపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు బుక్కుల పంపిణీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ అర్బన్ కేజీబీవీలో పీఆర్‌ఆర్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎస్సెస్సీ విద్యార్థులకు లాస్ట్ మినిట్ రివిజన్ బుక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు పాండరంగారావు, కేజీబీవీ ఎస్ఓ శంకరమ్మ, సువర్ణ, సురేష్, పద్మావతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటూర్‌లో టీబీ వైద్య శిబిరం


ఇప్పటూర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నవాబుపేట: మండలంలోని ఇప్పటూర్‌లో శుక్రవారం టీబీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో 121 మందికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ముందు జాగ్రత్త చర్యగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయశీల, శరభలింగం, రాజు, శ్రీనివాస్, రాఘవేందర్, భాస్కర్, వసుంధర, స్వాతి, స్నేహిత, జోష్న, లత తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రజల అవస్థలు


పొన్నకల్ స్టేజీ వద్ద ప్రధాన రోడ్డుపై నిలబడిన ప్రయాణికులు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ స్టేజీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై కర్నూల్ వైపు వెళ్లే రోడ్డుపై బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొన్నకల్, రాచాల, నందిపేట గ్రామాలకు చెందిన ప్రయాణికులు కర్నూల్, హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఇక్కడికి వస్తారు. ఇక్కడ బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ప్రధాన రోడ్డుపై వాహనాల కోసం నిలబడుతున్నారు. అతివేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పితే నేరుగా ప్రయాణికులపైకే దూసుకెళ్లే అవకాశం ఉంది. వర్షాకాలం, వేసవికాలంలో ప్రయాణికులు బస్సులు, ఆటోలు కోసం వర్షంలో, ఎండలోనే నిలబడాల్సి వస్తోంది. రహదారి నిర్వాహకులు స్పందించి ఇక్కడ బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం


విద్యాసదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ చామర్తి ఉమామహేశ్వర్‌రావు

కందనూలు: దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విద్యా భారతి దక్షిణ మధ్య సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వర్‌రావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సరస్వతీ శిశు మందిర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన విద్యాసదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడు దేశభక్తి కలిగి ఉండాలని, మనదేశం గొప్పతనాన్ని భావితరానికి తెలియజేయాలని, భారతీయులంతా ఐకమత్యంగా మెలుగుతూ దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాలమూరి విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సరస్వతీ విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు మిడిదొడ్డి శివశంకర్, సహాయ కార్యదర్శి నాగరాజు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వసతిగృహాల్లో నాణ్యమైన భోజనం అందించాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ ముసాయిదాబేగం


ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈఓ ముసాయిదాబేగం

మహమ్మదాబాద్: ప్రభుత్వ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ముసాయిదాబేగం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమపాఠశాల ఎస్టీ బాలుర వసతిగృహంలో, కేజీబీవీ పాఠశాలల్లో ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించేందుకు తాజా వస్తువులను వినియోగించాలని విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మెరుగైన విద్య తో పాటు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి స్టోర్‌రూంలో వంటసామగ్రిని తనిఖీ చేసి కూరగాయలను పరిశీలించారు. ఈమె వెంట ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఎంఈఓ రాజునాయక్, తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

దేవరకద్ర: మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అధికారులు మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ బలరాంలు విద్యార్థులకు భోజనం వడ్డించారు. భోజన శాలను పరిశుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని అధికారులు సూచించారు. పాఠశాల హెచ్‌ఎం ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలన్నారు.


దేవరకద్రలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న అధికారులు

పదో తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన

నవాబుపేట: పదో తరగతి విద్యార్థుల సంబంధించిన ఇంటర్నల్ మార్కుల పరిశీలన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కారుకొండ జెడ్పీ పాఠశాలలో విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన చేపట్టి సబ్జెక్టుల వారీగా ప్రాజెక్టు రిపోర్టు, వర్క్‌బుక్కులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగ్యానాయక్, జీహెచ్‌ఎం దశరత్‌నాయక్, జయరాజ్, రవి శంకర్, రాజశేఖర్ ఉన్నారు.


కారుకొండలో విద్యార్థుల రికార్డులు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

జనసంచారంలో గ్యాస్ సిలిండర్ల అమ్మకం


మహమ్మదాబాద్ పెట్రోల్‌బంక్ పక్కన సిలిండర్లు అమ్ముతున్న వ్యక్తి

మహమ్మదాబాద్: గ్యాస్ సిలిండర్లు ఎక్కడ అమ్మాలో, ఎక్కడ స్టాక్ చేసుకోవాలో సంబంధిత శాఖ అధికారులు గ్యాస్ డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. గ్యాస్ డీలర్లు వారి ఆదేశాలను బేఖాతర్ చేస్తూ నిబంధనలకు పాతరేస్తూ రోడ్లపై జనసంచార ప్రదేశాల్లో పెట్రోల్ పంపుల్లో, బస్టాండ్లలో అమ్ముతున్నారు. మండల పరిధిలోని వెంకట్‌రెడ్డిపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో భారత్‌గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కమీషన్లకు కక్కుర్తిపడి రోడ్లపై అమ్ముకునేందుకు తెరలేపారు. దీంతో మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లి గేట్ దగ్గర బస్టాండ్ ఆవరణలో జనసంచార ప్రదేశంలో బహిరంగంగా నిత్యం సిలిండర్లు అమ్ముతున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్లు అమ్మడం ఏమిటని పలువురు ప్రశ్నించినా ఫలితం లేదు. గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేసే వ్యక్తి ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నట్లు ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. ఈ విషయమై సంబంధిత డీటీ ఆదిత్యను వివరణ కోరగా, నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్లను అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉమ్రా యాత్రికుడికి ఘన సన్మానం


అబ్దుల్ జకీని సన్మానిస్తున్న మత పెద్దలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర ఉమ్రాయాత్రకు వెళ్తున్న జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, జామియ మజీద్ కమిటీ కార్యదర్శి అబ్దుల్ జకీని శుక్రవారం జుమా నమాజ్ అనంతరం జామీయ మజీద్‌లో సన్మానం చేశారు. పూలమాలలు, మెహెరుమాలతో ఘనంగా సత్కరించారు. పలువురు మాట్లాడుతూ ఉమ్రా షరీఫ్‌యాత్రలో జిల్లా ప్రజలు క్షేమం కోసం ప్రార్థన చేయాలని కోరారు. అనంతరం ప్రముఖ ధార్మికవేత్త మౌలానా ముఫ్తి సయ్యద్ సఫీర్ అహ్మద్ ప్రత్యేక దువా చేశారు. కార్యక్రమంలో జామీయ మజీద్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ అహ్మద్ అలీ సనా, కోశాధికారి ఇస్మాయిల్, ఎండీ.కలీం, మహ్మద్ తన్వీర్, జాఫర్‌అలీ, జహంగీర్‌పాషఖాద్రీ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పేదలకు పంపిణీ చేయాలి


చిన్నచింతకుంటలో తహసీల్దార్ ఎల్లయ్యకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చిన్నచింతకుంట: మండలంలోని నెల్లికొండి గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు శుక్రవారం తహసీల్దార్ ఎల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు భార్గవి మాట్లాడుతూ నెల్లికొండి గ్రామంలో గత ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల నిర్మాణానికి స్థలాని కేటాయించిందన్నారు.ఆ స్థలాన్ని పేదలకు పంచేందుకు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆ స్థలం నిరుపయోగంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని పేదలకు పంపిణీ చేసి ఇందిరమ్మ ఇళ్లు వారికి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, బాధితులు ఉన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ


దొడ్డలోనిపల్లిలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


తిర్మలాపూర్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/రాజాపూర్: జిల్లా కేంద్రంలోని దొడ్డలోనిపల్లి పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎంగా శ్రీనాథ్, టీచర్స్‌గా మోక్ష, దివ్య, నేత్ర, అక్షయ, వైష్ణవి, నవ్య, పీఈటీగా వివేక్ పాల్గొన్నారు.

- రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు బోధన చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సుధాకర్, ప్రధానోపాధ్యాయులు ఎబినేజర్, ఉపాధ్యాయులు రోజారాణి, నరేష్‌గౌడ్, సుమలత, మోహన, శ్రీదేవి పాల్గొన్నారు.

పనులు ప్రారంభమే కాలే!

- గడువు ముగిసినట్లు బోర్డు..

నవాబుపేట: రోడ్డు పని ప్రారంభించకుండానే దాని గడువులో పూర్తి చేస్తారంటూ ప్రభుత్వం అధికారిక బోర్డు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. పని పూర్తి కావాల్సిన తేదీ గడిచినా పని చేపట్టలేదు. మండలంలోని లింగంపల్లి రోడ్డు నుంచి వయా కిషన్‌గూడ, వీరన్నపల్లి – బాలానగర్ వరకు రోడ్డు పనులు గతేడాది ప్రారంభించినట్లు, దీన్ని త్వరలో పూర్తి చేస్తామని గడువు తేదీని సైతం తెలుపుతూ గురువారం బోర్డు వెలిసింది. ప్రభుత్వం ద్వారా అధికారికంగా ఏర్పాటు చేసిన బోర్డులో నవాబుపేట నుంచి బాలానగర్ వయా లింగంపల్లి, వీరన్నపల్లి వరకు బీటీ రోడ్డు రూ.47.40 లక్షలతో నిర్మిస్తున్నట్లు బోర్డులో తెలిపారు. గతేడాది జూలై 2న పని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. దీన్ని ఈ ఏడాది జనవరి 1 నాటికి పూర్తి చేస్తున్నట్లు తేదీని బోర్డులో సూచించారు. ఈ రోడ్డు పనులు ప్రారంభం కాకుండానే పని ప్రారంభించినట్లు, దాన్ని పూర్తి చేస్తున్నట్లు ప్రకటన బోర్డు పెట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు అవాక్కైయ్యారు. గతంలో మంజూరైన పనిని త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



నవాబుపేట - లింగంపల్లిలో పని ప్రారంభం కాకుండానే ఏర్పాటు చేసిన బోర్డు